క్లుప్తంగా

పారిశుద్ధ్య నిర్మూలనకు చర్యలు



తిమ్మాపూర్‌లో జ్వరాల పరిస్థితిని తెలుసుకుంటున్న జెడ్పీ సీఈఓ రమేశ్

జగదేవ్‌పూర్(గజ్వేల్): గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జెడ్పీ సీఈఓ రమేశ్ అన్నారు. మండలంలోని తిమ్మాపూర్, అనంతసాగర్ గ్రామాలను మంగళవారం సందర్శించారు. అలాగే తిగుల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం వచ్చే వ్యాధుల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. రెండు గ్రామాల్లో జ్వరాలు ఎక్కువగా ఉండడం వల్ల ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నామని, అందులో భాగంగా వైద్య శిబిరాలు నిరంతరం కొనసాగుతున్నాయన్నారు. ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తిగుల్ పీహెచ్‌సీ పరిసరాల్లో ఉన్న పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖాజా మొహినొద్దీన్, వైద్యులు రాజశేఖర్, కిరణ్, భాస్కర్, కార్యదర్శి విక్రమ్, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ చెల్లింపులతో పారదర్శకత: ఏపీఎం



అవగాహన కల్పిస్తున్న ఏపీఎం కిరణ్‌కుమార్

వర్గల్(గజ్వేల్): మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులు డిజిటల్ చెల్లింపు విధానంపై పట్టుసాధించాలని వర్గల్ మండల సెర్ప్ ఏపీఎం కిరణ్‌కుమార్ సూచించారు. గౌరారంలో స్వయం సహాయక సంఘ సభ్యులకు మంగళవారం ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత లావాదేవీలపై ఒక్కరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. డిజిటల్ చెల్లింపులతో పారదర్శకత ఉంటుందని, అలాగే సమయం ఆదా అవుతుందని చెప్పారు. సీసీ సత్యనారాయణ పర్యవేక్షణలో కొనసాగిన ఈ సదస్సులో కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్లు కవిత, వరలక్ష్మి మహిళలకు అవగాహన కల్పించారు. వీఓఏ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎంఈఓ రమేశ్

కొమురవెల్లి(సిద్దిపేట): ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని మండల విద్యాధికారి బి.రమేశ్ ప్రశంసించారు. మండల వనరుల కేంద్రంలో ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను మంగళవారం ఆయన సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా బోధిస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎదగాలన్నారు. విద్యార్థులకు జ్ఞానాన్ని అందించడం, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు. జె.శ్రీనివాస్‌రెడ్డి, రాజు, మల్లయ్య, రవి తదితర ఉపాధాయ్యులు పాల్గొన్నారు.

గ్రామసభ బహిష్కరణ



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నంగునూరు(సిద్దిపేట): నిధులు లేకుండా అభివృద్ధి పనులు ఎలా చేస్తారని ఆగ్రహించిన గ్రామస్తులు మంగళవారం బద్దిపడగలో నిర్వహించిన గ్రామసభను బహిష్కరించారు. సభ ప్రారంభం కాగానే గ్రామ ప్రత్యేక అధికారి గీత ఎందుకు రాలేదని మాజీ సర్పంచ్ కొండల్‌రెడ్డి ప్రశ్నించారు. పారిశుద్ధ్య పనులు నిర్వహించకపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, వీధిలైట్లు బిగించడంతోపాటు బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులు కోరారు. పనులు చేయించేందుకు నిధులు లేవని పంచాయతీ కార్యదర్శి చెప్పడంతో డబ్బులు లేకుండా సభ ఎందుకు నిర్వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కళాశాల తనిఖీ

బెజ్జంకి(సిద్దిపేట): ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం సిద్దిపేట డీఐఈఓ రవీందర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు రిజిష్టర్లు పరిశీలించారు. అధ్యాపకులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. విద్యార్థుల హాజరు శాతం పెంచాలని సూచించారు. విద్యార్థులకు ఫేస్ రికగ్నిషన్ ద్వారా హాజరు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవస్వామి, సదానందం, అధ్యాపకులు పాల్గొన్నారు.

‘ఇందిరమ్మ’కు ఇసుకేదీ?

- కురుస్తున్న వానలు
- నిండిన చెరువులు
- లబ్ధిదారులకు తప్పని తిప్పలు

ఇల్లు కట్టి చూడు పెండ్లి చేసి చూడు అంటారు వెనుకటి పెద్దలు. మనిషికి తిండి, బట్ట ఎంత అవసరమో ఉండడానికి ఇల్లు కూడా అంతే అవసరం. అయితే సొంతిల్లు లేని పేదలు చాలా మంది ఉన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంతో తమ సొంతింటి కల నెరవేరుతుందని పేదలు ఆశలు పెట్టుకున్నారు. కాని వాటి నిర్మాణాలకు ఇసుక దొరక్కపోవడంతో ఆ ఆశలు అడియాసలవుతున్నాయి.



నిలిచిపోయిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం



నిండిన చెరువు

దుబ్బాకరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని వారి కోసం సొంతి ఇల్లు కట్టుకోవడానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశపెట్టింది. అందులో భాగంగా కొందరికి ఇళ్ల మంజూరు చేసింది. అలాగే నిర్మించుకోవడానికి వివిధ దశల వారీగా రూ.5 లక్షలు సహాయం అందిస్తోంది. పునాది నుంచి స్లాబ్ నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రభుత్వం కేటాయించిన రూ. ఐదు లక్షలతోనే నిర్మాణం చేసుకోవాల్సి ఉంది.

ఇసుక కొరత

అయితే ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల నిర్మాణానికి తగినంత ఇసుక లేక పోవడంతో కొంత మంది నిర్మాణాలు నిలిపివేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు, వాగులు నిండి పోయాయి. దీంతో ఇసుక కొరత ఏర్పడింది. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇల్లు కట్టుకోలేకపోతున్నాం



ఇసుక కొరత తీవ్రంగా ఉండడంతో ఇల్లు కట్టుకోలేకపోతున్నాం. సమీప ప్రాంతాలల్లోని వాగులు, చెరువులు నిండి ఉండడంతో ఇసుక కొరత ఏర్పడింది. దూర ప్రాంతాల నుంచి ఇసుక తెచ్చుకోవాలంటే అధిక ధర చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో ఇసుక కొనలేకపోతున్నాం.

- లక్ష్మి, లబ్ధిదారు

‘సురవరం’ జీవితం ప్రజలకే అంకితం

సీపీఐ జాతీయ నేత చాడ వెంకట్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి తదితరులు

హుస్నాబాద్: సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్ రెడ్డి జీవితమంతా ప్రజల అభ్యున్నతి కోసం పోరాడటానికే అంకితం చేశారని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సీపీఐ భవన్‌లో సురవరం సుధాకర్‌రెడ్డి సంతాపసభ మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డి విద్యార్థి, యువజన సంఘం నాయకుడిగా, ఎంపీగా, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా అంచెలంచెలుగా ఎదిగారన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని, వారి త్యాగాలను గుర్తించి హైదరాబాద్‌లో పదెకరాల్లో స్మృతివనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే మంత్రి పొన్నం స్పందించి హుస్నాబాద్ ప్రధాన కూడలిలో అనబేరి విగ్రహాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, సత్యనారాయణ, శంకర్, అశోక్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించాలి

సోషల్ స్టడీస్ ఫోరం నేత పూర్ణచందర్‌రావు



ప్రతిభ చూపిన విద్యార్థులతో పూర్ణచందర్‌రావు, ఉపాధ్యాయులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను బయటకుతీసి ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని సోషల్ స్టడీస్ ఫోరం జిల్లా అధ్యక్షుడు పూర్ణచందర్‌రావు అన్నారు. ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన, చర్చాగోష్ఠి పోటీలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ, వారధి ఫౌండేషన్, జిల్లా సాంఘికశాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో 11 మండలాల పరిధిలోని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. డిబేట్ విభాగంలో ప్రథమ స్థానంలో ఇందిరానగర్, ద్వితీయ స్థానంలో లచ్చపేట ఆదర్శపాఠశాల, తృతీయ స్థానంలో చింతమడక విద్యార్థులు విజయం సాధించారు. వ్యాసరచన విభాగంలో ప్రథమ స్థానంలో ఘనపూర్, ద్వితీయ స్థానంలో గుర్రాలగొంది, తృతీయ స్థానంలో బక్రీ చెప్యాల విద్యార్థులు నిలిచారు. ఈ సందర్భంగా పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనాకర్‌రెడ్డి, మామిండ్ల లక్ష్మారెడ్డి, నాగరాజు, శ్రీకాంత్, నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్నేహభావంతో మెలగడం ముఖ్యం

ఏసీపీ సదానందం



వివరాలు పరిశీలిస్తున్న ఏసీపీ సదానందం

అక్కన్నపేట(హుస్నాబాద్): సమస్యలపై ఫిర్యాదు చేయడానికి వచ్చిన వారితో స్నేహభావంతో మెలగడం చాలా కీలకమని, మర్యాదగా మాట్లాడి వారి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏసీపీ సదానందం అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి, విధులు నిర్వహణ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్‌లో నమోదవుతున్న దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధుల్లో అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వీపీఓలు రెండు, మూడు రోజులకు ఒకసారి గ్రామాలను తప్పకుండా సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని కోరారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. సీఐ శ్రీనివాస్, ఎస్ఐ చాతరాజు ప్రశాంత్, ఏఎస్ఐ రామ్మూర్తి, కానిస్టేబుల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ అందించడమే లక్ష్యం

సీడీపీఓ ఎల్లయ్య



మాట్లాడుతున్న సీడీపీఓ ఎల్లయ్య

దుబ్బాకటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రీ ప్రైమరీ విద్య అందించడమే ‘పోషణ్ బీ-పడాయి బీ’ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని దుబ్బాక ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీఓ ఎన్.ఎల్లయ్య అన్నారు. ప్రాజెక్టు పరిధిలో 202 మంది అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో రెండో రోజు మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. మూడు నుంచి ఆరేళ్లు కలిగిన చిన్నారులకు సమర్థవంతమైన సంరక్షణ, చక్కని విద్య అందించడమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. చిన్నారులకు సరైన పోషకాలు కలిగిన ఆహారం అందించడంతో పాటు ప్రాథమిక విద్యను నేర్పే కేంద్రాలుగా అంగన్‌వాడీలను తీర్చిదిద్దాలని, తద్వారా పిల్లల బంగారు భవిష్యత్‌కు చక్కటి పునాది ఏర్పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్లు ప్రసాద్, శాంసన్, సూపర్‌వైజర్లు చంద్రకళ, స్వరూప, గిరిజ, అంతుల్, సిబ్బంది సురేశ్, జనార్దన్, టీచర్లు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కబడ్డీ, వాలీబాల్ జిల్లా జట్టుకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు సిద్దిపేట అర్బన్ ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు రక్షిత్, అభిషేక్‌ను పాఠశాలలో మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 నుంచి 29 వరకు నిజామాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్-17 కబడ్డీ, వాలీబాల్ పోటీలలో జిల్లా జట్టు తరఫున పాల్గొననున్నట్లు చెప్పారు.

నూతన కమిటీ ఎన్నిక



వీరమల్లయ్య



వేణుగోపాల్‌గుప్తా

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని సాయి కేపీఆర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కాలనీ సభ్యుల సమక్షంలో మంగళవారం జరిగిన ఈ ఎన్నికలో అసోసియేషన్ శాశ్వత గౌరవ అధ్యక్షుడిగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా వంగపల్లి వెంకటేశం, అధ్యక్షుడిగా ఆరెళ్ల వీరమల్లయ్యగౌడ్‌ను ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా గందె వేణుగోపాల్ గుప్తా, ఉపాధ్యక్షుడిగా కద్దూరి మహేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా రాసూరి శ్రీనివాస్, కోశాధికారిగా మలిపెద్ది రామకృష్ణ, నిర్వహణ కార్యదర్శిగా బూరుగు సత్యనారాయణ, గౌరవ సలహాదారులుగా తుంగపవన్, ఇర్రి వెంకటనర్సింహారెడ్డి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

రేపు ఉద్యాన విశ్వవిద్యాలయంలో జాతీయ సదస్సు

ములుగు(గజ్వేల్): కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో 18, 19న ఉద్యానరంగంపై పర్యావరణ మార్పులు తదితర అంశాలపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దండా రాజిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సదస్సులో వాతావరణ మార్పులు, పంటలపై ప్రభావం, అనుసరించాల్సిన వ్యూహాలు తదితర అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. రైతులు ఎదుర్కొనే సమస్యలకు పరిష్కార మార్గాలపై చర్చిస్తారన్నారు. అనంతరం అధికారులతో కలసి సదస్సుకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు.

శిక్షణ కేంద్రం ప్రారంభం

చేర్యాల(సిద్దిపేట): నకాషీ చిత్రకళల కేంద్రంలో నిర్వ హించనున్న శిక్షణ కార్యక్రమాన్ని హస్తకళల అభివృద్ధి సంస్థ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ సువర్ల మంగళవారం ప్రారంభించారు. శిక్షణకు 30 మందిని ఎంపిక చేశారు. ఈ శిక్షణను కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. రాకేశ్, దివాకర్, యేసురాముడు పాల్గొన్నారు.

కీచక ఉపాధ్యాయులపై చర్యలేవి?



మాట్లాడుతున్న నరేశ్‌గౌడ్

ములుగు(గజ్వేల్): ప్రైవేట్ పాఠశాలల్లో కీచక ఉపాధ్యాయులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. ములుగు మండలం వంటిమామిడిలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. లక్ష్మక్కపల్లిలోని వెరిటాస్ సైనిక్ ఇంటర్ నేషనల్ పాఠశాల ఉపాధ్యాయుడు ప్రణయ్ 9వ తరగతి బాలికపై లైంగిక దాడికి ప్రయత్నించడం దారుణం అన్నారు. అలాంటి విద్యా సంస్థల గుర్తింపు రద్దుచేసి, బాలికను బెదిరించిన ప్రిన్సిపాల్‌పై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ప్రత్యేక పూజలు.. అభిషేకాలు

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గ విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో మంగళవారం ఆర్ద్రా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నిర్వాహకుడు చెప్పెల హరినాథశర్మ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. మోహనకృష్ణ శర్మ, వేదవ్యాస్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



కూలిన ఇంటిలో మహిళ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో తిమ్మాపూర్‌లో పోసాని బాలమణి ఇల్లు పాక్షికంగా కూలింది. ఉండేందుకు గూడు సరిగా లేదని, ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని బాధిత మహిళ కోరారు. అలాగే పంట చేన్లలో వర్షం నీరు నిలిచి నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓజోన్ పొర మానవాళికి రక్షణ కవచం

వర్గల్(గజ్వేల్): సూర్యుని నుంచి అతినీల లోహిత కిరణాలు నేరుగా భూమిని చేరకుండా ఓజోన్ పొర మానవాళికి రక్షణ కవచంగా నిలుస్తుందని వర్గల్ పూలే గురుకుల బాలికల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు అన్నారు. అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మోటారు వాహనాలు, పరిశ్రమల కాలుష్యం, ఏసీల వాడకం తదితర కారణాలతో ఓజోన్‌పొర క్షీణిస్తోందన్నారు. కాలుష్యానికి అడ్డుకట్ట వేయడం ద్వారా ఓజోన్ పొర పరిరక్షణకు ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. ప్రయోగ పద్ధతిలో ఓజోన్ పొర ప్రాధాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు, బయో కెమిస్ట్రీ విభాగం అధిపతి ఉష తదితరులు పాల్గొన్నారు.

గౌడకులస్తుల అక్రమ అరెస్టులు సరికాదు

మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు స్వామిగౌడ్



కొమురవెల్లి(సిద్దిపేట): మాట్లాడుతున్న స్వామిగౌడ్

కొమురవెల్లి(సిద్దిపేట): గౌడ కులస్తుల హక్కుల సాధనకు కృషిచేస్తున్న మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్‌ను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని జిల్లా అధ్యక్షుడు స్వామిగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిజమాబాద్ జిల్లా ఏర్గాట్ల మండలం తాళ్లరాంపూర్‌లో గౌడ కులస్తులపై ఆ గ్రామ వీడీసీ దాడి చేయగా దానిపై స్పందించిన నర్సాగౌడ్‌ను అక్రమంగా అరెస్టు చేయడం తగదన్నారు. ఆ వీడీసీపై చర్యలు తీసుకోవాలని, గౌడ కులస్తులకు న్యాయం చేయలని డిమాండ్ చేశారు. జాతీయ ఉపాధ్యక్షుడు నర్సింహులు, రమేశ్, ఐలేని గౌడ్, భాను గౌడ్, కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన తప్పదు

దుబ్బాక: గౌడ కులస్తులపై పోలీసులు దాడులుచేసి అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని గౌడజన హక్కుల పోరాట సమితి, మోకుదెబ్బ జాతీయ కార్యదర్శి రాగుల సిద్ధిరాములుగౌడ్ అన్నారు. మంగళవారం ఆయన దుబ్బాకలో విలేకరులతో మాట్లాడారు. గౌడ కులస్తుల అక్రమ అరెస్టులపై ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మత్తడి దూకుతున్న చెరువులు



మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. చిన్నకోడూరులోని పెద్ద చెరువు అలుగు పారడంతో గ్రామస్తులు మంగళవారం అక్కడికి చేరి సందడి చేశారు.

- చిన్నకోడూరు(సిద్దిపేట)

సంక్షిప్త వార్తలు

◆ పరిసరాల శుభ్రత తప్పనిసరి

దౌల్తాబాద్(దుబ్బాక): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు శుభ్రత పాటించాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు ఆస రామారావు అన్నారు. మండల పరిధిలోని సూరంపల్లిలో మంగళవారం కలెక్టర్ హైమావతి, జిల్లా పౌర సమాచార పౌరసంబంధాలశాఖ అధికారి రవికుమార్ ఆదేశాల మేరకు కళా ప్రదర్శన నిర్వహించారు. ఎల్లయ్య, నర్సయ్య, ఎల్లయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

◆ విమోచన దినోత్సవం నిర్వహిద్దాం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందామని బీజేపీ రాష్ట్ర నాయకురాలు ఆకుల విజయ అన్నారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సెప్టెంబరు 17 తెలంగాణ విమోచన దినోత్సవమేనని, ఈ ఉత్సవాన్ని వాడవాడలా జరుపుకోవాలన్నారు. బైరి శంకర్, సంతోష్, జనార్దన్,జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

◆ ఆడిట్‌పై అవగాహన అవసరం

మిరుదొడ్డి(దుబ్బాక): మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక లావాదేవీలపై అవగాహన ఉండాలని సీబీఓ ఆడిటర్ వేణుగోపాల్ సూచించారు. మండల మహిళా సమైక్య కార్యాలయంలో మంగళవారం ఐకేపీ, వీఓఏలకు ఆడిట్ నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీనర్సమ్మ, సీసీలు బాలరాజు, వైకుంఠం, జ్యోతి, వరలక్ష్మి, ఈశ్వరమ్మ, ప్రభాకర్, శారద తదితరులు పాల్గొన్నారు.

◆ ఉపాధ్యాయుల సమావేశం

దౌల్తాబాద్(దుబ్బాక): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రాథమిక స్థాయి పాఠశాలలు, వ్యాయామ ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ కనకనరాజు హాజరయ్యారు. హెచ్ఎం అనిల్‌కుమార్ మాట్లాడారు. వేణుగోపాల్, మెహరాజ్ బేగం, ఫిజికల్ డైరెక్టర్ విష్ణు, సీఆర్పీలు రాజు, చంద్రమౌళి పాల్గొన్నారు.

◆ ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ధర్నా

హుస్నాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. లోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల మొండి వైఖరి అవలంభిస్తోందన్నారు.

◆ ప్రాణ దాతలుగా నిలుద్దాం

దుబ్బాకటౌన్: రక్తదానం చేద్దాం ప్రాణదాతలుగా నిలుద్దామని రాయపోల్ మండలం వడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు వరప్రసాద్ అన్నారు. మంగళవారం గజ్వేల్ పీవీ నరసింహారావు చారిటబుల్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్‌లో ఓ వ్యక్తికి బి పాజిటివ్ రక్తం అత్యవసరమనే సమాచారానికి స్పందించి వెంటనే రక్తం దానం చేశారు.

◆ పోస్టర్ ఆవిష్కరణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్‌శాఖ ఉద్యోగులకు శ్రీనివాస ఆర్థోపెడిక్ ఆస్పత్రిలో ఉచిత చికిత్స అందించనున్నట్లు ఎస్ఈ చంద్రమోహన్ అన్నారు. దానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా విద్యుత్ భవన్‌లో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఎముకలు, కీళ్ళమార్పిడి ఆపరేషన్లు తదితర చికిత్సలకు ఉచితంగా సేవలందించనున్నట్లు చెప్పారు.

◆ 19న లంబాడీల ఆత్మగౌరవ సభ

హుస్నాబాద్: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద 19న నిర్వహించే లంబాడీల ఆత్మ గౌరవ సభను విజయవంతం చేయాలని గిరిజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సభకు చెందిన పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. బీలు నాయక్, భూక్య మంగ, తిరుపతి నాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

◆ ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా.మహేశ్‌కుమార్ కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మంగళవారం పెద్దకోడూరులో శ్రమదానం చేశారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు.